# సిస్టమ్

## విజయార్కె

అతను నడుస్తున్నాడు.

పరుగులాంటి నడక కాదు. తిండి లేక నీరసంతో అడుగులు తడబడే నడక. దూరం నుండి అతన్నెవరైనా చూస్తే తాగి తూలుతూ నడుస్తున్నాడేమోననే అనుమానం కలగకమానదు.

ఓ ప్రక్క త్రాగుడు ఆరోగ్యానికి హానికరమని చెబుతూ, తమకొచ్చే ఆదాయం ఎక్కడ పడిపోతుందోనని, ప్రజల కొరకు ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రజానేతలు, త్రాగడం ప్రాణ హాని అంటూ, మద్యానికి రాజమార్గంగా అనుమతిచ్చే ప్రభుత్వం, సగటు సామాన్యుడికి, ఓ విద్యాధికుడికి ఉద్యోగం కల్పించలేకపోతున్నందుకు నిరసనగా ఆకలి అతన్ని బహిష్కరించింది. అందుకే పాపం! అతను నీరసంగా అడుగువేస్తున్నాడు.

ఒక్కొక్క అడుగు పడుతుంటే, ఒక్కో గ్రహాన్ని సందర్శించినట్టుగా అన్పిస్తుందతనికి. సినిమాల్లో మాదిరిగా ప్రతీ అడుగుకు ఒకో ఇంటి సీను ఫ్లాష్‌బ్యాక్‌లో కన్పిస్తుంది.

అతను వేసిన కేక ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించింది. నెత్తురు విరజిమ్మింది. వాళ్ళు... ఆ దుండగులు నిర్లక్ష్యంగా వెనుతిరిగారు. ఇదంతా చూస్తున్న అతను వణికిపోయాడు. భయంతో బిగుసుకుపోయాడు. ఓ చెట్టు...

ఓ అడుగు తడబడింది. అప్పుడో సీనులో తల్లి దగ్గు, తండ్రి నిస్సహాయత కన్పించాయి. మరో అడుగు తడబడింది నీరసంగా. అప్పుడు మరో సీను. ఆ సీనులో తమ్ముళ్ళిద్దరు, ఓ చెల్లాయి, స్కూల్లో ఫీజు కట్టని పాపానికి ఇంటికి తిరిగొచ్చి ఫీజు కట్టకుండా స్కూల్‌కెందుకు నాన్నా మమ్మల్ని పంపించావని? తండ్రిని నిందిస్తున్నారు.

అదే సీనులో తండ్రి బాధ, మరుక్షణంలోనే ఆ బాధ ఆవేశమైంది. అప్పుడో డైలాగ్, మీ అన్నయ్యని పోస్ట్ గ్రాడ్యుయేషన్ దాకా ఉన్నదంతా అమ్మి చదివిస్తే సంపాదిస్తున్నాడుగా లక్షలు. కనీసం గెడ్డం చేసుకోవడానికి బ్లేడుక్కూడా నేనే డబ్బులివ్వాలి. ఇంకా మీరు చదివి ఉద్ధరిస్తారా? ఉక్రోషం, ఆవేశం, ఆవేదన వెరసి ఆయన ఉగ్రరూపం.

మరో అడుగు తడబడింది. ఆ సీనులోఅతనే. సగటు నిరుద్యోగి, తన కాళ్ళమీద తాను నిలబడలేని వెన్నెముక లేని మనిషి. 'ఛీ' అతని అంతరాత్మ ఛీత్కరించింది. అప్పుడు సమయం అర్థరాత్రి పన్నెండు దాటింది. సిటీ బస్సులో వెళ్ళడానికి ఛార్జీలు లేక, నడూస్తున్నాడతను. ఆకలి అతన్ని నిలదీస్తుంది. నిరుద్యోగం తనని క్షమించమని ఆకలిని ప్రాధేయపడుతుంది.

"ఇన్నేళ్ళ తన చదువు, ఇన్ని సంవత్సరాల తన ప్రతిభ, దీక్ష సంపాదించుకున్న సర్టిఫికెట్లు, తాకట్టులోకి వెళ్ళిన వస్తువులు, అన్నీ... అన్నీ కలిసి పిడికెడు మెతుకులు సంపాదించడానికి ఉపయోగపడలేకపోయాయి. తమని అవసాన దశలో పోషిస్తారని ఆశపడ్డకన్నవాళ్ళకు నిరాశ మిగిల్చి, తనని, తాను పోషించుకోలేకపోతున్న తన అసమర్థతకు సిగ్గుతో కుంచించుపోతున్నాడతను"

తన మీద తనకే కసిగా ఉంది. జీవితంతో నిరంతరం యుద్ధం చేస్తూ ఓడిపోయేకన్నా ఒకేసారి చస్తే...? అవును చాలాసార్లు ఈ ఆలోచన అతనికి వచ్చింది.

ఎందుకంటే? ఏ సమస్యా ఉండదు. ఉద్యోగం కోసం వెతుక్కోవాల్సిన పని కాని, తన తమ్ముళ్ళని చదివించాల్సిన అవసరం కాని, తన కన్నవాళ్ళని పోషించాల్సిన బాధ్యత కాని, చివరకు... ఎట్ లాస్ట్... తన ఆకలిని చంపుకోవాల్సిన అవసరం లేదు.

యస్...

ఏ అవసరం లేకుండా పోతుంది. కాని చావడమెలా?

ఇలా ఆలోచించి... ఆలోచించి ఓసారి ఆత్మహత్యా ప్రయత్నం చేయబోయి, ట్యాంక్‌బండ్ దగ్గర, హుస్సేన్ సాగర్‌లో దూకబోయిన తనని ఇద్దరు కానిస్టేబుళ్ళు చూడడం, స్టేషన్‌కు లాక్కెళ్ళడం. మొదటి తప్పుగా, మందలించి జడ్జి వదిలేయడం, సినిమా రీళ్ళలా చుట్టూ తిరిగాయి.

ఛ... తన బ్రతుక్కి ఓ పరిష్కారం కూడానా?

మరేం చేయాలి?

ఆలోచిస్తూ నడుస్తున్నాడతను.

ఆ నిశి వేళ

ఓ వ్యక్తి పరుగెత్తుకొస్తున్న చప్పుడు.

ఆ వెనకే మరికొంతమంది పరుగెత్తుకొస్తున్న చప్పుడు. పరుగెత్తుకొస్తున్న ఆ యువకుడ్ని చుట్టుముట్టారు కొంత మంది దుండగులు.

"వద్దు... నన్నేం చేయవద్దు... ప్లీజ్ మిమ్మల్ని నేనసలు చూడలేదు. మీరెవరో నాకు తెలియదు. నేనెవరితోనూ మీ గూర్చి చెప్పను" అతను చేతులు జోడించి వేడుకుంటున్నాడు.

"మా గూర్చి తెలిసిన నువ్వు బ్రతకడానికి వీల్లేదు" ఓ దుండగుడు ఆ యువకుడ్ని సమీపించాడు. చేతిలో పొడవాటి కత్తి.

"నాకు భార్యా, బిడ్డలున్నారు. ప్లీజ్ మీ గూర్చి నేనెవ్వరితోనూ చెప్పను" అంతే.

ఆ దుండగులు నిర్దాక్షిణ్యంగా ఆ యువకుడ్ని చుట్టుముట్టి, అతని కడుపులోకి కత్తి దిగేలా పొడిచారు.

అతను వేసిన కేక ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించింది.

నెత్తురు విరజిమ్మింది. వాళ్ళు... ఆ దుండగులు నిర్లక్ష్యంగా వెను తిరిగారు. ఇదంతా చూస్తున్న అతను వణికిపోయాడు. భయంతో బిగుసుకుపోయాడు. ఓ చెట్టు చాటున ఉన్న తనని ఆ దుండగులు గమనించలేదు కాబట్టి తను బ్రతికిపోయాడు. లేకపోతే... ఈ పాటికి తాను శవమై... అమ్మో...

ఆ యువకుడు గిల, గిల కొట్టుకుంటున్నాడు.

ఏం చేయాలి?

మెల్లిగా తడబడే అడుగులతో ఆ యువకుడ్నిసమీపించాడతను. అప్పటికే ఆ యువకుడి ప్రాణాలు అనంతవాయువుల్లో కల్సిపోయాయి.

ఒక్క క్షణం అయోమయంలో పడిపోయాడతను.

మరుక్షణం ఓ బాధ్యతగల పౌరుడిగా, తాను చిన్నప్పుడు చదువుకున్న బాధ్యతలనే పాఠాలు గుర్తుకొచ్చాయి. ఓ అడుగు ముందుకేసాడు బాధ్యతగల పౌరుడిగా అతను.

మరుక్షణం అతనిలో ఆకలి ఆ బాధ్యతగల పౌరుడ్ని వెనక్కిలాగింది.

"నన్నెందుకు వెనక్కి లాగుతున్నావు? అతనిలోని బాధ్యతగల పౌరుడు అడిగాడు ఆకలిని.

"నన్ను పోషించే బాధ్యత లేని నువ్వు నీ బాధ్యత గూర్చి ఆలోచిస్తున్నావా?

"నన్నేం చేయమంటావు?"

"ముందు నీలో నుండి నన్ను తిరిమివేసి ఆ తర్వాత ఏమైనా చేసుకో?"

"అంటే ఆకలిని తరిమివేయాలా?"

"అవును"

"అది నా వల్ల కాదు"

"అవుతుంది... ఆలోచించు'?

"అతను ఆలోచించాడు. అదీ ఒకే ఒక క్షణం. మరుక్షణం టెలిఫోన్ బూత్‌లోకి వెళ్ళి ఫోన్జేసాడు పోలీస్ స్టేషన్‌కు.

***

పోలీస్ జీప్ ఆగింది.

అందులో నుండి ఇన్స్‌పెక్టర్, పోలీసులు దిగారు.

ఎదురుగా శవం.

శవం దగ్గర అతను. అతని చేతిలో కత్తి.

మరో రెండు నిమిషాల్లో అతని చేతికి సంకెళ్ళు పడ్డాయి.

***

అది కోర్టు.

ఇసుక వేస్తే రాలనంత జనం.

బోనులో అతను నిలబడి ఉన్నాడు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేచాడు.

"యువరానర్...ఓ వ్యక్తిని అతి దారుణంగా హత్యచేసిన ఇతన్ని కఠినంగా శిక్షించాల్సిందిగా మనవి చేస్తున్నాను" జడ్జి అతనివైపు చూశాడు.

"నువ్వు ఈ హత్య చేసావని ఒప్పుకుంటున్నావా?"

"చేసాను"

"ఎందుకు చేసావు"

"..."

"మౌనం సమాధానం కాదు"

"క్షమించండి న్యాయమూర్తి గారు. ఇతనికి. నాకు వ్యక్తిగత కక్షలు. ఆ కక్షతోనే అతన్ని దారికాచి, దారుణంగా చంపాను"

నీ తరపున వాదించడానికి ఎవరినైనా నియమించుకుంటావా?"

"అక్కర్లేదు నేను నేరాన్ని అంగీకరిస్తున్నాను"

"చివరిసారిగా నువ్వు కోర్టుకు చెప్పుకునేదేమైనా ఉందా?"

"న్యాయమూర్తిగారు, మన్నిస్తానంటే ఓ కోరిక ఉంది"

"కోరికా? ఏమిటది?"

"మీ తీర్పు వెలువడిన తరువాత నాకు మాట్లాడే అవకాశం ఇవ్వాలి"

"ముందుగా నువ్వేమైనా చెప్పుకోదలిస్తే శిక్ష తగ్గే అవకాశం ఉండవచ్చు"

"క్షమించాలి"

***

ఓ వ్యక్తిని దారుణంగా హత్యచేసిన ఈ నిందితునికి మరణశిక్ష విధించాలి. కానీ ఏ మూలనో మానవత్వం



నన్ను కరిగించింది. అందుకే ఈ నిందితునికి ఉరిశిక్షకు బదులు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తున్నాను''

జడ్జి తన తీర్పును వినిపించాడు.

న్యాయమూర్తిగారు నాకు ఓ అయిదు నిమిషాలు మాట్లాడే అవకాశం ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను.

లేవబోయిన జడ్జి కూర్చున్నాడు.

గ్యాలరీలోని జనం ఆసక్తిగా ఆగిపోయారు.

మరుక్షణం అతను పగలబడి నవ్వసాగడు.

అలా... అలా నవ్వుతూ ఓ క్షణం ఆగాడు.

అతని కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి.

''ఓ నిరపరాధికి యావజ్జీవ కారాగారశిక్ష విధించినందుకు న్యాయమూర్తి గారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను''

కోర్టులో పిన్‌డ్రాప్ సైలెన్స్.

దయచేసి మధ్యలో నన్ను ఆపకండి.

దయచేసి నాకు పడ్డ శిక్షను మార్చి, నన్ను నిర్దోషిగా విడుదల చేయకండి మిలార్డ్. ఈ చట్టాలు, ఈ ప్రభుత్వాలు ఈ నిరుద్యోగికి పిడికెడన్నం పెట్టే ఉద్యోగాన్ని కల్పించలేకపోయాయి.

నిరుద్యోగులను ఉత్పత్తిచేసే కార్ఖానాలుగా విశ్వవిద్యాలయాలను స్థాపిస్తున్నారే తప్ప, పిడికెడన్నం పెట్టే పనిని ఎవ్వరూ చేయడం లేదు. నేనో పోస్ట్ గ్రాడ్యుయేట్‌ని. పట్టా పుచ్చుకున్నది మొదలు ఇన్నేళ్ళు గడిచినా ఉద్యోగం లేదు.

ఆకలిని జయించే శక్తి నాకు లేదు.

బ్రతకలేక, ఆత్మహత్య చేసుకోబోతే ఇదే న్యాయస్థానంలో, మీరే...మిలార్డ్... ఆత్మహత్యా ప్రయత్నాలు నేరమంటూ మందలించి వదిలిపెట్టారు.

ఈ చట్టాలు శాసనాలు నా ఆకలి బాధని తీర్చలేవు.

విముక్తి కోసం చద్దామంటే చావనివ్వవు.

అందుకే... అందుకే యువరానర్... చేయని నేరాన్ని నెత్తినేసుకున్నాను. హంతకుడిగా బోనెక్కాను. నేరస్తుడిగా శిక్షను అనుభవించడానికి సిద్ధపడ్డాను.

నాకిప్పుడు ఆకలి బాధ లేదు మిలార్డ్.

నేనిప్పుడు నిజమైన స్వేచ్ఛా జీవిని. ఏ ఆఫీసుల చుట్టూ తిరగక్కర్లేదు. పొట్టకూటికోసం ఎవర్నీ ప్రాధేయపడక్కర్లేదు. నా కడుపు నింపుకోవడానికి నాకిప్పుడు ఏ పట్టాలు అక్కర్లేదు. ఎవ్వరి రికమండేషన్లు అక్కర్లేదు. ఓ నిరుద్యోగిగా నన్ను భరించలేని, ఆదుకోలేని ఈ ప్రభుత్వం ఈ చట్టాలు, ఓ ఖైదీగా నన్ను పోషిస్తున్నందుకు భారత శిక్షాస్మృతికి కన్నీటితో కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. కోర్టు బోనులో కుప్పలా కూలిపడిపోయాడు. ఇప్పుడతనికి ఆకలి బాధ లేదు.

*



## నిద్ర

రాత్రి పడుకోబోతుండగా పక్కింటి జయంతి తలుపు తట్టింది.

''ఏమిటే ఇంత రాత్రివేళ వచ్చావు?'' అడిగింది వాసంతి.

''సాయంత్రం షాపింగ్ కెళ్ళి ఎంత మంచి చీర తెచ్చానో... నీకు చూపించకపోతే నా మనసు విలవిల్లాడిపోతోంది... నిద్రపట్టదు... అందుకే వచ్చా....'' అంది చీరపట్టుకుని వచ్చి జయంతి.

''సరే... అని చీర చూసింది వాసంతి.

''ఇక నాకు మాత్రం రాత్రి నిద్ర ఎలా పడుతుందనుకున్నావ్?'' అంది చీరల పిచ్చి వాసంతి.

వంపల సత్యనారాయణ
(మొలగపల్లి)

